# జోస్యమేనా?

శ్రీ రావినూతల రామమూర్తి పంతులు

ప్రపంచానికి మాంద్యభూతం పట్టింది. అనేక దేశాల్లో అనేక విధాలుగా ఆభూతం సంచారం చేస్తోంది. మానవ లోకం అంతా యీ పెనుభూతం తాలూకు సింహగర్జనాలతోటి మార్మోగుతూ ఉంది.

వర్షాల్లో మాంద్యం, పంటల్లో మాంద్యం, ధరల్లో మాంద్యం, వర్తకంలో మాంద్యం, ఉద్యోగాల్లో మాంద్యం, ఆర్థికమాంద్యం ఇంకా గమనిస్తే, కులవృత్తులకు మాంద్యం, వకీళ్లకు మాంద్యం, వైద్యులకు మాంద్యం, జౌతిషులకు మాంద్యం, కూలివాళ్లకు మాంద్యం, బిచ్చగాళ్లకు మాంద్యం, పండితులకు మాంద్యం, జుట్టుకు మాంద్యం, బొట్టుకు మాంద్యం, మాటలకు మాంద్యం, భార్యకు మాంద్యం, ఇంట్లో మాంద్యం, బయట మాంద్యం, ఎవర్నడిగినా మాంద్యం, ఎక్కడజూచినా మాంద్యం, అంతా మాంద్యం.

* * * *

ఉదయం ఆరుగంటలకే అనుష్ఠానాలన్నీ ముగించుకొని అల్లయాచార్యులు సిద్ధంగా కూచుని వున్నాడు. ఆచార్ల రూపం అత్యంత గాంభీర్యంగా ఉంటుంది. చాటంత ముఖం, చాఅడేసి కళ్లూ, తగిన లావుగల తలా, అందులో నడినెత్తిన పిలకజుట్టూ, మొగం మీది పంగనామాల్లూ అతనికి అందాన్ని గలిగించాయి.

ఆవూళ్లో ఆచారి ప్రసిద్ధికెక్కిన జ్యోతిషికుడు పూర్వం డబ్బు బాగా సంపాదించాడు. కాని యిప్పుడు అతన్ని కూడా, మాద్యభూతం ఆవేశించినందు వల్ల, ఆర్థికమాంద్యం అగచాట్లు పెడుతోంది. అయినా - జౌతిషం, సాముద్రికం, ధర్మశాస్త్రం – వైదికం – అన్ని విషయాలూ తెలుసును గనుక గంభీరంగా కాలక్షేపం జేస్తూన్నాడు.

అప్పుడు పది గంటలకు పైబడ్డది. అంతవరకూ ఆనాటి త్యాజ్జం అడగడానికయినా ఎవరు రాలేదు ఆచార్లుగారి దగ్గరికి. ఆచార్లు యింటిదగ్గర కాఫీ అయినా తీసుకోని రాలేదు – తాను వచ్చేటప్పటికి తయారు కాకపోవడం చాత, ఆఫీసుకు వెళ్లితే అక్కడ ఏపుల్లయ్యో మంచిరోజు అడగడాని కయినా, తిథివార నక్షత్రాలు తెలుసుకోటాని కయినా, మరి దేనికోసమయినా రాక పోడు ఏదోవిధంగా దబాయించి కాఫీ ఖర్చుపెట్టిస్తామన్నట్టుగా జేబులో దమ్మిడీకూడా వేసుకోకుండానే వచ్చాడు. పదిగంటలు దాటినా ఏ దరిద్రుడూ రాలేదు. కాఫీటయిమ్ మించిపోయింది కూడాను, కడుపు దహించుక పోతూంది. యింట్లో వంట పన్నెండు గంటలకు కాని కాదు. మరింకేం జేస్తాడు! పాపం! మనిషి కన కన లాడి పోతున్నాడు.

ఆ వీధి వెంట ఒక బిచ్చగాడు పోతున్నాడు. ఆచార్లు వాణ్ణి ఎగా దిగా చూచి - ఎందుకో? తల వూపి, సమాధానపడి, వుత్సాహం వుట్టిపడ: "ఒరే? అబ్బీ! యిలారా?" అని పిల్చాడు.


ఆ ముష్టివాఁడు "ఏం బాబూ! ఏం సెలవు" అంటూ సమీపించాడు.

ఆచారి:—నీ పేరేమిటోయ్.

ముష్టి:—రంగడు బాబూ!

ఆచా:—ఆఁ! సరే! అయితే నీవు చాలా అదృష్టవంతుడవోయ్.

ముష్టి:—ఏ మదుట్టమో సామీ! పుట్టి బుద్ధెరిగిన కాణ్ణుంచీ యీ ముష్టెత్తుకోటం తప్పలా?



ముష్టి:—అంటే, ఏంటి బాబూ!

ఆచా:—నీకు గొప్ప అదృష్టం పడుతుందన్న మాట!

ముష్టి:—బాబు కూడా నవుతా లాడతారా ?

ఆచా:—ఓరి! అమాయికుడా! యింకా నమ్మలేదు టోయ్! యింత కూ నే నెవరో తెలుసా?

ముష్టి:—తెలీదు, సామీ!

ఆచా:—జోతిషసింహ! సాము ద్రిక శార్దూల! వేదాంత వ్యాఘ్ర! ధర్మ తత్వక! శ్రీ మదల్ల యాచా ర్యులగార్ని నేనే నోయ్.!

ముష్టి:—అయితే! అల్లయ్యాచా ర్లుగారా! బాబూ మీరు!

ఆచా :—అవును. మరెవరనుకు న్నావు?

ముష్టి:—ఇదివరకీ పేరు విన్నానే. గాని, తమర్ని కండ్లారా చూచిన పాపిని కాదు బాబూ! ఏదో! తెలవక అన్నాను - మొటుముండా కొడు కుని - మన్నించండి సామీ!

ఆచా:—ఇవాళతో నీ కష్టాలు గట్టెక్కుతా యను కోవోయ్.

ముష్టి:—అబ్బో! అంత పుణ్యమా! బాబూ! యీ పాప్టి ముండాకొడుకును చూస్తే చావుకూడ అసహ్యించు కొంటదే మహానుభావా!

ఆచా:—ఓయి! వెఱ్ఱి మొగమా! అది కాదోయి నేను చెప్పేదీ!

ముష్టి:—మరేంది బాబూ!

ఆచా:—ఈ రోజు నీకు దశ తిరుగుతుందోయ్!

ఆచా:—చెప్పేది విను.

ముష్టి:—చిత్తం సెలవియ్యండి బాబూ.

ఆచా:—ఇవాళ ఉదయం నేను జపంజేస్తూ ఉన్న ప్పుడు ఆకాశవాణి చెప్పింది. ఈరోజు ఉదయం పది గంటలకు పయిన నీ ఆఫీసుకు ఎదురుగా ఉండే రోడ్డు మీద ఉత్తరం నుంచి దక్షిణానికి పోతూవుండే మనిషికి చాలా ధనం దొరుకుతుంది. ఆవిధంగా పోతూ నాకంట బడిన వాడవు నువ్వే—తెలిసిందా!

ముష్టి:—తమవాక్కు చలవని అంత పుణ్యమే పుడి తే మీ పాదాల్ని బంగారు పూలతో పూజించనూ! మహాను భావా!

ఆచా:—బళే! భేష్! మెచ్చుకో తగ్గమాటోయ్!

ముష్టి:—ఇంతకీ సాములోరికి దయవుండాలి.

ఆచా:—సరే! ఇంక నీకు అదృష్టం ఎక్కడ ఎట్లా పట్టేదీ చెప్పవద్దటోయ్!

ముష్టి:—అది సెప్పకపోతే ఎలా బాబూ?

ఆచా:—అందుకు తగిన సామాగ్రి లేందేనా?

ముష్టి:—ఏంకావాలి, బాబూ?

ఆచా:—వెఱ్ఱిమొగమా! ఆమాత్రం తెలియదటోయ్! ఏదైనా ఫలం తెలుసుకోవాలంటే జ్యోతిష్కుడికి దక్షణా, తాంబూలమూ, ముందు సమర్పించాలనీ!

ముష్టి:—అయితే తెస్తానుండండి సామీ! యిప్పుడే, నంటూ ఒక్కపరుగున పోయి ఆరోడ్డుమీదే ప్రక్కన ఉన్న వక పాన్ దుకాణంలో — తాను ఎన్నాళ్లబట్టీ దమ్మిడీ భిక్షం పోగుచేశాడో కాని – చెరుగున ఉన్న మూటవిప్పి అణాన్నర బయటికి తీసి ఒకకానీకి తములపాకులూ, మరోకానీకీ వక్కలూ తీసుకుని, మిగత అణా దక్షణగా బెట్టి, ఆచార్ల గారికి సమర్పించి నమస్కారం జేసాడు.

అప్పుడు ఆచారి మొగంలో ఆనందం తాండవించింది.

రంగణ్ణి చూచి ఆచార్లు "ఇదుగో! ఈరోడ్డు మీదే యింకా కొంచందూరం దక్షిణానికి పోతే కుడిచేతివైపున మరొక చిన్నవీధి వొస్తుంది. ఆవీధిలో ప్రవేశించు ఆపైన ఆవీధిలో పోతూ, నీకు ఎడంచేతివైపున ఉన్న మూడో యింట్లో- ముంగిటచలవ పందిరీ పెద్దపూలతోటా ఉంటాయిలే –ప్రవేశించి లోపలికి పోయింతర్వాత – ఆయింటి యజమాని రెండో అంతస్తు మహడీలో వుంటాడు - నీవు చక్కా ఆయనదగ్గిరి కెళ్లు. అతడు మామూలుగా, నిన్ను చూస్తూనే కోపగించు కుంటాడు - ఏమేమో అంటాడు - అయితే ఆయన ఎంత కసిరి కొట్టినా భయపడి వెళ్లిరాకు. ఆతడు ముందుగా ఎవరన్నయినా అట్లాగే అంటాడు. తరువాత వాళ్లకి తగినంత సహాయం తప్పకుండా చేస్తాడు. తగిన డబ్బువుంది. నీవు ఎంత మొండిపట్టు బడితే అంత లాభం. చూసుకో. మరి, నీతెలివితేట లిందులో కనబర చాలి. వెళ్లు! వెళ్లు! ఆలస్యం చేయకు.

"చిత్తం, చిత్తం, సెలవుబాబూ" అంటూ రంగడు ఆచార్లుచూపిన మార్గాన్ని అనుసరించి వెళ్లాడు.

౨

రామేశం పంతులు పేరు ప్రతిష్ఠలు గల వకీలు. ప్రాక్టీసు బాగానే ఉంది. ఉన్నది కొంచమైనా నగదు డబ్బు. పర్సనాలటీ విషయంలో పంతులు ఖద్దరు ధారి స్వరద్రూసి. స్వరాజిష్టు, కార్మికవాది. పైగా మక్కోపీ ప్రపంచంలో ఉండే ప్రతివ్యక్తీ కాయ కష్టంచేత స్వంతంగా ఆర్జించిన డబ్బుతోటే జీవనం చెయ్యాలని ఆతని ఆశయమూ తత్వమూ కూడా. ముష్టి ఎత్తుకోడమూ, ధర్మం అడగడమూ, ఆత్మ ద్రోహమూ, ఈశ్వర ద్రోహమూ. అది అలా వుండనిచ్చి—ముష్టి వేశినా, దానం జేసినా, ధర్మం జేసినా "క్రైమ్" అంటాడు.

పైగా—అందరూ, బిచ్చం వెయ్యడం చేత, దాన ధర్మాలు చెయ్యడం చేత, సోమరిపోతులూ, పని దొంగలూ, అయిన అల్లరి జనమంతా వేళకు దొరికినంత వరకూ తిని దిగులూ విచారం లేకుండా కూచొని కాలక్షేపం చెయ్యవచ్చు ననుకొని, భిక్షగాండ్రుగానూ, కావి గుడ్డలూ, కట్టుకొని సన్యాసులుగానూ, బోడి గుండ్లతో బైరాగులుగాను బయలుదేరి—ప్రతి మానవుడూ ప్రపంచంలో స్వశక్తి చూపవలయునను ఈశ్వరా దేశమునకు వ్యతిరేకంగా—కష్ట జీవులగు సంసారుల ప్రాణాలకు యమదూతల మల్లే దాపురమవుతా రంటూ తన వాదాన్ని బల పరుస్తాడు. ఎవరేనా, "గుడ్డీ కుంటీ కురూపుల గతి ఎట్లాగండీ? అందరూ తమ తత్వం అవలంబిస్తే" అని అడిగితే "పూర్వ జన్మలో పాపాలు చేసి ఉంటేనే యీ జన్మంలో ఎవరేనా గుడ్డిగానో, కుంటిగానో, పుట్టేది. కాబట్టి వాళ్లు చేసిన పాపాలకి తగిన శిక్ష వాళ్లు యీ జన్మంల్లో యీ విధంగా అనుభవించాల్సిందే. తప్పు చేస్తే రేపు మనకు మాత్రం తప్పుతుందా? ఏం? నవ్వుతూ చేసింది ఏడుస్తూ అనుభవించా" లంటూ, వాళ్లకి సమాధానం జెబుతాడు. ముష్టివాళ్లను గుమ్మంలో

చూడగానే "సోమరి వెధవలు—గాడిదల్లాగా ముష్టెత్తు కోకపోతే కూలీ నాలీ చేసుకోకూడదుం? దొంగ వెధ వల్లారా! ఫోండి! మరోమారు యిలా వొస్తెరా వీపులు బద్దలవుతవి జాగ్రత!" అంటూ వాళ్ల మీదికి కొరడా తీసుకుని బయలుదేరుతాడు యముడిలాగు.

ఆనాడు ఆదివారం అవడం చేతపంతులుగారు యింట్లోనే ఉన్నారు. భార్యతో సరసాలాడు తున్నాడు. మాటమీద మాటవచ్చి వియ్యాలవారి విందుల విషయాలలో బడ్డారు—ఆ మధ్యనే పంతులుగారి బిడ్డ పెళ్లి జరిగింది లెండి - పంతులుగారికీ ఆయన భార్యకీ పరస్పర అభిప్రాయ భేదాలు కలిగాయి. సరసం విరసంగా మారింది—అయితే, చేతులు చేతులు కలియలేదు లేండి. అందుకు ఫలితంగా అమ్మగారు అలిగి పండుకోడమూ, పంతులవారు కుర్చీకి చేరగిలఁబడి ఆ విషయాన్నే ఆలోచిస్తూ ఉండడమూ, జరిగాయి.

ఇంతలో సమయంగాని ఆసమయంలో గుమాస్తా వచ్చి బిక్క మొహంతో ఎదట నిలుచున్నాడు. పంతులు అతి కోపంతో" ఏం ఎందుకు వచ్చావు " అన్నాడు.

"మీకోసమే వచ్చాను. మీకొంప మునిగి పోతుంటే తెలిసి చెప్పక పోవడం అధర్మ మనుకొని సంగతి కాస్తా చెబుదామను కొనివచ్చాను." అన్నాడు గుమాస్తా.

అతి హడావిడిగా లేచి కూర్చుని "ఏమిటి కథ" అన్నాడు పంతులు

"సరే లెండి ఏమీ తెలియనట్టు అడుగు తున్నారు. పొద్దున మీరు కొట్టిన ఆబిచ్చగాడు చావడానికి సిద్ధముగా ఆస్పత్రిలో వున్నాడు. పోలీసులు వాడి దగ్గర స్టేటు మెంటు తీసుకొన్నారుట."

"ఎవరూ—పొద్దున మేడమీదికి వచ్చిన బిచ్చగాడా?"

"కాబోలు – ఎవరో బిచ్చగాడు చాలా ముసలివాడు వచ్చాడుట. వాణ్ణి మనయింట్లో నుంచి నెట్టించి వేసినారుట. వాడు మేడ మెట్లమీద నుంచి కిందపడి పోయినాడుట. ఆపడడములో కాలు విరిగిపోయిం దిట"

"బ్రతుకుతాడా"

"బ్రతికినా చచ్చినా మామీద క్రిమినల్ కేసు మాత్రము తప్పదన్నారు"

"వాడి స్టేటుమెంటేనా. సాక్ష్యులు ఎవరయినా వున్నారా ?"

"సాక్ష్యు లేమిటండీ - మీయింటి దగ్గిర వాడు పడి పోయి కాలు విరిగి చస్తూ ఏడుస్తూ వుంటే స్కౌటు కుర్రాళ్లువచ్చి వాణ్ణి ఆస్పత్రి చేర్చించారుట. ఆస్కౌటు లంతా స్టేటుమెంట్లు యివ్వ దలచుకొని వున్నారుట. పయిగా సబ్ యిన్స్పెక్టరుకు మీమీద కసిగాకూడా వుంది. వాడు తప్పకుండా కేసు పెట్టే తీరుతాడు."

"నిజంగా అంతపనీ జరిగిందీ ?"

"ఆఁ ఇప్పుడు ఏమాత్రం ఆలస్యం చేసినా సమయం మించిపోతుంది. చేతులు కాలిని తర్వాత తడుముకొని ప్రయోజనం లేదుగదా ?"

"అయితే ఏంచేద్దా మంటావు"

"పెద్దలు మీరే ఆలోచించండి"

"ఇప్పుడు స్కౌట్లను కట్టు దిట్టము చేయడము మనకు సాధ్యము కాదు. బ్రహ్మదేవుడికి సాధ్యము కాదు. కుర్ర ముండాకొడుకులు, లోకజ్ఞానము లేకపోవడము నుంచి వాళ్లు చెప్పినమాట వినరు. మరి ఎట్లాగోయ్"

"మీరే ఆలోచించండి. పోలీసు వాళ్లను సంతోష పెట్టడమంటే తమకు తెలిసిన విషయమే గదా - అదీ ఎంతవరకూ సాధ్యమవుతుందో పెద్దలకు నేను విన్నవించు కోవలెనా ? అయినా కేసు మాఫుకావడము దుస్సాధ్య మను కొంటాను."

"ఇంతకూ పోలీసువాళ్లు ఆ బిచ్చగాడి దగ్గిర స్టేటు మెంటు తీసుకొన్నారా ?"

"ఇంకా లేదు. డాక్టరుకూడా వుండాలిట. ఆయన యింకా రాలేదు. ఆయనకోసం ఎదురు చూస్తూ వున్నారు. స్కౌట్ల స్టేటుమెంట్లు యీపాటికి పూర్తి అయివుంటవేమో"

"అయితే నీవు తక్షణం పరుగెత్తి కెళ్లి అవసరమయిన ఖర్చులన్నీ పెట్టి ఆక్సిడెంటుగా (Accident) గా

వాడు మేడమెట్లు జారి పడిపోయినట్లు సాక్ష్యములను యిప్పించుము"

"సాధ్యము అవుతుందా"

"నీవు నీయొయ్యాగపు చిన్నవాడివి తలచు కొంటే అసాధ్యము వుంటుందోయ్. పోయిరా, నీసంగతి తర్వాత చెపుతాగా — దీం తస్సాగొయ్యా — ఎంతపని జరిగింది? ఎంతయినా ఖర్చుకానియ్యి. కేసుమాత్రము రాకూడదు. నీవుపోయి మరి చూడు"

"చిత్తం" అంటూ గుమాస్తా వెళ్లి పోయినాడు.

* * * *

ఆ మర్నాడు వుదయము పంతులుగారి ఖాతా పుస్తకాలలో జమాఖర్చు చేస్తూ గుమాస్తా యింటి ఖర్చుకింద ఆరువందల యాభై రూపాయలు ఖర్చు వ్రాసినాడు.

* * * *

అల్లయాచార్యులవారు జోస్యము ఫలించినందుకు తనకు ఆయిదో వంతు రావలెనని పట్టుబట్టాడు. కాని రంగడు తన కాలు అవుడు అవుతుందని జోస్యులవారు చెప్పనందుకు గాను అయిదోవంతు యివ్వనని పోట్లాడి నూటికి అయిదు రూపాయల చొప్పున పాతికె రూపాయలు మాత్రము యిచ్చాడు. ఆదివారం ఉదయము జోస్యము చెప్పినందుకు ఆచార్యుల వారికి ఒకమాసం గ్రాసము దొరికింది.

మిగత నూటయాభై రూపాయలు ఏఖాతాలోకి చేరినవో విచారించ వలసి వుంది.

ప్రశస్తమయిన

లేసు వేసిన ధోవతులు, మధుర ఉత్తరీయములు

కేశవరాం అండ్ కంపెని

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మదరాసు

మంచి సరకు వెల సరసము



భృంగామలకతైలము

మెదటికి, శరీరానికి చలువదన మిచ్చును.

1 ఔన్సు మాదిరి బుడ్డి $2\frac{1}{2}$ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజనగూడు పండ్లపొడి

I.O.L.61. మెడికొటెడ్

ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్, బందరువీధి, మదరాసు

300 కృత్రిమర్గ కాలకి మోసపోకండి. సరాసరి వొకే ఆర్డరివ్వండి 8 అ. 6 ప్యాకెట్లు. తపాలాచార్జి ఉచితము.

హోల్ ఏజెంట్లు: యునైటెడ్ కన్సరన్, బందరువీధి, మద్రాసు.

కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ,

రాజమంద్రి, అరవరామస్వామి అండ్ సన్సు,

బందరు, ఆనందాఫార్మసీయందును దొరుకును.

మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందఱు చదువవలసినది

ఇందు, స్త్రీ పురుషజాతులు, ఏయేజాతిస్త్రీ యేయే పురుషునికి తగినది, స్త్రీని పురుషుడెట్లు వశ పఱచుకొనుట —యింకను ఎన్నో స్త్రీ పురుషులకు ముఖ్యముగ తెలియ వలసిన విషయములు ఉన్నవి. వెల 8 అణాలు.

ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాసు